దేశానికి తెలంగాణ ఓ ప్రామాణికం

ఇక్కడేం జరిగినా.. ఆ ప్రభావం దేశవ్యాప్తంగా కనిపిస్తుంది • ఇక్కడ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడం కాంగ్రెస్ పార్టీకి జాతీయ అవసరం

రాజ్యాంగం పట్టుకొని ప్రమాణం చేసిన వారు.. హక్కులు కాపాడాలి • పేదలు, మధ్యతరగతి ప్రజలకు ప్రత్యామ్నాయం చూపాకే ఇల్లు కూల్చాలి

- బొటానికల్ గార్డెన్ విషయంలో కేసీఆర్ ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు
- ముఖ్యమంత్రి సోదరుడి ఇల్లు కూల్చకుండా హైడ్రా ముందుకెళ్లలేదు
- పార్టీ మారితే రాజీనామా చేయాలనే చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి
- 'నమస్తే తెలంగాణ'తో పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్

నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): అన్ని విషయాల్లో దేశానికి ఒక రోల్ మాడల్గా, ప్రామాణికంగా ఉండాల్సిన తెలంగాణలో పౌరహక్కులు, చట్టబద్ధపాలన, ప్రజాస్వామ్య పునరుద్ధరణ అనేవి ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి జాతీయ అవసరమని పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ అభిప్రాయపడ్డారు. 'మేము మంచిగా, చట్టబద్ధంగా పరిపాలిస్తున్నం' అని రాహుల్గాంధీ చెప్పుకోవడానికైనా తెలంగాణలో ఒక ప్రజాస్వామిక, సాంస్కృతిక వికాసం కావాలని స్పష్టంచేశారు. రాజ్యాంగాన్ని పట్టుకొని మరీ ప్రమాణం చేశారు కాబట్టి, ఇది వారి నైతిక బాధ్యత అని 'నమస్తే తెలంగాణ' ఇంటర్వ్యూలో చెప్పారు.

ప్రజా ప్రభుత్వం, ప్రజాపాలన పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వ పది నెలల పాలన ఎలా ఉన్నది? మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధుల తీరు ఎలా ఉన్నది?

ప్రభుత్వాన్ని పది నెలల్లో అంచనా వేయలేం. కాంగ్రెస్ పార్టీ తమ నేతలను కలిపి తీసుకెళ్లడంలో ఇబ్బంది పడుతున్నది. ముగ్గురు, నలుగురు మంత్రులు పవర్ఫుల్గా ఉన్నారు. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు, వాటి అమలుకు కావాల్సిన వనరులు సమీకరించలేకపోతున్నారు. హామీల అమలులో ఇబ్బందిపడుతున్నారు. బీజేపీ కూడా తెలంగాణలో అధికారంలోకి రావాలనుకుంటున్నది కాబట్టి, కేంద్ర సహకారం ఎక్కువగా ఉండదు. మరోవైపు, ఇచ్చిన హామీలపై ప్రతిపక్షాలు నిలదీస్తున్నాయి. టీంవర్క్ అక్కడక్కడా లోపిస్తున్నది. ఇంకో రెండేండ్లు పూర్తయితే కానీ, పూర్తి అంచనా వేయలేము.

పౌరహక్కులు, ప్రజాసంఘాల మీటింగ్లకు సైతం అనుమతులు ఇవ్వడం లేదు? ఈ విషయంలో మీరు ప్రభుత్వంతో ఏమైనా మాట్లాడారా?

ఈ సమస్య మొదట్లో వచ్చింది. పౌరహక్కుల సంఘాల మీటింగ్లకు కూడా పోలీసులు అనుమతులు అడిగారు. మేము సీఎం దృష్టికి తీసుకొచ్చాం. కొంత పరిస్థితి మారింది.

బీఆర్ఎస్ హయాంలో ఒకేఒక్క ఎన్కౌంటర్ జరిగినట్టు పోలీసు రికార్డులు చెప్తున్నాయి. ప్రజాపాలనలో మావోయిస్టుల ఎన్కౌంటర్లు ప్రారంభమయ్యాయి. దీనిపై మీరేమంటారు?

ఇటీవల తెలంగాణలో ఒక ఎన్కౌంటర్ జరిగింది. ప్రజాస్వామ్య పునరుద్ధరణ, ప్రజాపాలన అంటూ చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పాలనలో ఇలా జరగడమేంటి? అని మేమంతా ఆశ్చర్యపోయాం. అప్పుడున్న పోలీసు యంత్రాంగమే కదా ఇది. 'మీరు ప్రజాస్వామ్యానికి కట్టుబడి ఉన్నారు కాబట్టి.. పోలీసుల ఓవర్ యాక్షన్ తగ్గించాలని, పోలీసు ఆటిట్యూడ్ మార్చాల్సి ఉన్నది' అని ప్రభుత్వానికి చెప్పాం. పోలీసు యంత్రాంగంలో చాలా మార్పులు రావాలి. లేకపోతే క్షేత్రస్థాయిలో చాలా నష్టం వాటిల్లుతుంది.

'ఆపరేషనన్ కగార్'లో భాగంగా నిర్వహించిన మీంటింగ్కు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి, సీఎస్, డీజీపీ హాజరయ్యారు.. దీన్ని మీరెలా చూస్తారు?

మావోయిస్టుల ఉనికి లేకుండా చేస్తామని చెప్పే కేంద్ర హోంశాఖ మంత్రి మీటింగ్కు ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి హాజరయ్యారు. కేంద్ర హోంమంత్రిగా ఆయన కొన్ని డైరెక్షన్లు ఇచ్చే ఉంటారు. అయితే, కాంగ్రెస్ నేతలు రాజ్యాంగాన్ని పట్టుకొనే ప్రచారం, ప్రమాణ స్వీకారం చేశారు కాబట్టి.. 'మాకు రాజ్యాంగం ప్రామాణికం, చట్టబద్ధంగా పరిపాలించాల్సి ఉంటుంది. దానికి మేము కట్టుబడి ఉన్నాం' అని హోంమంత్రికి చెప్పారనే అనుకుంటున్నాం. లేదా కాంగ్రెస్ ఆ స్టాండ్ తీసుకోవాలి. అలా చెప్పగలిగితే, ప్రజాస్వామ్యాన్ని కొంతవరకైనా కాపాడినట్టే.

తెలంగాణలో పట్టుసాధించాలని, అధికారం చేపట్టాలని చూస్తున్న బీజేపీ.. రాష్ట్ర కాంగ్రెస్పై ఒత్తిడి చేయకుండా ఉంటుందా? తన రాజకీయ అనుభవంతో కేసీఆర్ నిలబడ్డారు. రేవంత్రెడ్డి ఆ స్థాయిలో నిలబడగలరా?

నిజమే, కేసీఆర్ తన రాజకీయ అనుభవంతో కొంతవరకు కేంద్రం ఒత్తిడిని తట్టుకున్నారు. ఎక్కడైనా ఇలాంటి ఒత్తిడిలు ప్రజాప్రభుత్వంలో మంచివి కాదు. చట్టాలకు అతీతమైన ఎన్కౌంటర్లు చేస్తే ఇబ్బందే. వాళ్లు, వీళ్లు ఎదురెదురుగా తారసపడి ఫైర్ చేసుకుంటే, అటువంటి ఎన్కౌంటర్లను పౌరహక్కుల సంఘం విమర్శించదు. బూటకపు ఎన్కౌంటర్లు చేస్తేనే ఇబ్బంది. ఎందుకంటే వారు రాజ్యాంగం మీద ప్రమాణం చేశారు. కేంద్ర ఒత్తిడిని రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మేరకు తట్టుకుంటుందో చూడాలి.

ఇదే అంశంలో నేటికీ ముఖ్యమంత్రి సోదరుడి నివాసం ఇంకా కూల్చలేదు.. పేదల ఇండ్లు కూలిపోతున్నాయి.. మీరేలా చూస్తారు?

ప్రభుత్వం ఆ ఇంటిని కూడా కూలగొడతామని అంటున్నది. దానిని కూలగొట్టకుండా ముందుకు వెళ్లలేరు. మన తమ్ముడు, బంధువు అంటే కుదరదు కదా. ఆ ఇల్లును సాక్షాత్తూ సీఎం కూలగొట్టిస్తామంటున్నారు. ఒకవేళ కూల్చకపోతే దాని పరిణామాలు ప్రభుత్వం ఎదుర్కొవాల్సి ఉంటుంది. బాధితులు సమయం అడిగితే కొంత వెసులుబాటు ఇవ్వాలి. ఇది కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికిప్పుడే యుద్ధ ప్రాతిపదికగా చేయాల్సిన అవసరం కూడా లేదని అన్నాం. లేకపోతే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు వస్తాయని వివరించాం.

వరుస ఎన్కౌంటర్లతో కేంద్ర, రాష్ట్రాలు మారణహోమం సృష్టిస్తున్నాయి. మావోయిస్టుల ఉద్యమ పంథా మారాలని సీపీఐ నారాయణ అంటున్నారు? మారాల్సిన అవసరం ఉన్నదా?

ఇది మావోయిస్టుల ఉద్యమమే కాదు. ఆదివాసీల ఉద్యమం. 200 ఏండ్లుగా వారు పోరాడుతున్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ రైల్వేకు కలప కావాలని అడవుల్లోకి వచ్చిన దగ్గరు నుంచీ రాజ్యంతో పోరాటాలు కొనసాగుతున్నాయి. వాటి ఫలితంగానే రాజ్యాంగంలో షెడ్యూల్డ్ 5 వచ్చింది. ఆ తర్వాత పీసా చట్టం, 1/70, ఫారెస్ట్ రైట్స్ చట్టం వచ్చింది. అయితే, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు అడవులను కొట్టేసి, ఖనిజాలను కార్పొరేట్లకు ఇస్తామంటున్నారు. ఈ క్రమంలో అడ్డొస్తే.. చెట్లను, మావోయిస్టులను కొట్టేస్తామంటున్నారు. ఈ ఆలోచన రాజ్యాంగబద్ధం కాదు. మావోయిస్టులు కూడా ఉద్యమ పంథా గురించి సమీక్ష చేసుకోవాలి.

కేంద్రం చెప్పినట్టు మావోయిస్టులను ఏరివేస్తే ఉద్యమం ఆగిపోతుందా?

వాళ్లను ఏరివేసినా కూడా ఉద్యమం ఆగదు కదా. అడవులను ఆగం చేస్తామంటే ఎవరు ఊరుకుంటారు? బొలివీయాలో ఇలాగే ఖనిజాలను కార్పొరేట్లకు ఇచ్చారు. అంతా తవ్వుకొని వెళ్తే.. ఇప్పుడది బొందల గడ్డలా మారింది. మన దేశంలో చట్టం ఆదివాసీల అనుమతి లేకుండా ఏ పనీ చేయకూడదని ఉన్నది. వారిని ఒప్పించినా పునరావాసం కల్పించాలి. ఆదివాసీలకు చట్టబద్ధంగా కల్పించిన హక్కులను గౌరవించాలి. సమస్యలు ఉన్నంత వరకూ ఆదివాసీల ఉద్యమాలు కొనసాగుతాయి. ఏదో రూపంలో అవి ఉద్భవిస్తూనే ఉంటాయి. మరో చోట పుడుతూనే ఉంటాయి.

తెలంగాణ ఉద్యమంతో ప్రత్యక్షంగా సంబంధం లేని మాజీ ప్రధాని రాజీవ్గాంధీ విగ్రహాన్ని సచివాలయం ఎదురుగా ప్రతిష్ఠించడాన్ని మీరెలా చూస్తారు?

ఇదొక కాంట్రవర్సీ. జరిగిపోయింది. అయితే, సచివాలయ నిర్మాణానికి ముందే, కేసీఆర్ అక్కడే తెలంగాణ తల్లి విగ్రహం పెట్టించి ఉంటే బాగుండేది. నా విషయానికి వస్తే వ్యక్తులు, నాయకుల విగ్రహాల ప్రతిష్ఠాపన నాకు అంగీకారం కాదు.

పట్టణాల భవిష్యత్ దృష్యా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలి?

పట్టణ భవిష్యత్ దృష్ట్యా.. ఆక్రమణలను తొలగించాల్సిందే. బొటానికల్ గార్డెన్ విషయంలో తెలంగాణ ఏర్పడక ముందు కాంగ్రెస్ అక్కడ టూరిజం అభివృద్ధి చేస్తామని ముందుకు వచ్చింది. మేము దానికి వ్యతిరేకంగా పోరాడాం, అడ్డుకున్నాం. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కేసీఆర్ను కలిసి సమస్యలన్నీ వివరించాం. ఆయన వాటిని సానుకూలంగా విని, దానికి జోలికి ఎవ్వరూ వెళ్లరని హామీ ఇచ్చారు. ఇప్పుడది అలాగే ఉన్నది. అయితే, బొటానికల్ గార్డెన్ను కూడా టూరిజం కేంద్రం చేయాలని ప్రస్తుత ప్రభుత్వం చూస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది.

అడ్డదిడ్డంగా, అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారుల విషయంలో ప్రభుత్వం ఎలా ఉండాలి?

ఇప్పటి కూల్చివేతలకు.. నాడు ప్రభుత్వ అధికారులు ఎలా వాటికి అనుమతులు ఇచ్చారు? అనేది ప్రధాన అంశం. అధికారులు చెరువుల్లో పర్మిషన్ ఎలా ఇస్తారు? వారు ఉన్నదే వాటిని కాపాడుకోవడానికి కదా? పేదలకు లీగల్గా పర్మిషన్ ఉన్నది. వారికి నీళ్లు ఇచ్చారు.. కరెంటు ఇచ్చారు.. ఇప్పుడు ఇండ్లు ఎలా కూల్చుతారు? ఇది ముమ్మాటికి అధికారుల తప్పు. భవిష్యత్లో అధికారులు అలాంటి తప్పులు చేయకుండా ప్రభుత్వాలు పటిష్ఠ చర్యలు తీసుకోవాలి. ఈ ప్రభుత్వానికి ఆ అవకాశం ఉన్నది. అధికారులకు చట్టపరమైన భయం ఉంటే ఇలాంటి పొరపాట్లు జరగవు.

బీఆర్ఎస్ హయాంలో రైతు సంక్షేమ పథకాలు సకాలంలో రైతులకు అందాయి. ప్రస్తుతం వాటి అమలు ప్రశ్నార్థకంగా మారింది?

హామీలు ఇచ్చేముందు ఆర్థిక వనరులను అంచనా వేయాలి. ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతులకు న్యాయం చేయాలని కోరుతున్నాం. రైతులకు ఇచ్చిన హామీలను నిలుపుకోవడం ఏ ప్రభుత్వానికైనా అతిపెద్ద సవాలు. ఈ ప్రభుత్వానికి వనరుల సమీకరణ కష్టంగా మారింది.

కొత్త క్రిమినల్ చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి వైఖరీ ప్రకటించలేదు. వాటిపై మీ అభిప్రాయం?

కొత్త చట్టంలో పోలీసులకు చాలా అధికారాలు ఇచ్చారు. అందువల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోవచ్చు. నేరాలు తగ్గించేందుకు మెరుగైన మానవ సంబంధాలు, పనిచేసుకునే హక్కు, అందరికీ పని, వసతుల కల్పన, విద్య, అందులో నైతిక విలువల బోధన వంటివి ప్రభుత్వం చేపట్టాలి.

మీరు ప్రభుత్వానికి ఏమైనా సూచనలు, సలహాలు ఇవ్వాలనుకుంటున్నారా?

నిర్బంధాన్ని తగ్గించాలి. అప్పటి సీఎం కేసీఆర్ దృష్టికి వచ్చినప్పుడు నాతో సహా ఆరుగురిపై ఉపా కేసు ఉపసంహరించుకున్నారు. ఏ తప్పు చేయని వారిని ఏండ్ల తరబడి జైల్లో వేయడం దారుణం. పోలీసులు కూడా ఉపా చట్టాలు, ఇతర కేసులు పెట్టేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలి. గతంలో జరిగిన పొరపాట్ల నుంచే కదా వీళ్లు నేర్చుకోవల్సింది.

ఒక విద్యావేత్తగా ఎలాంటి మార్పులు కోరుతున్నారు?

ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత పటిష్టం చేయాలి. అందరికీ సమానమైన, నాణ్యమైన, ఉచిత విద్యను కామన్ స్కూళ్ల ద్వారా అందించాలి. 40 ఏండ్లుగా విద్యా పరిరక్షణ కమిటీ ఈ విధానం కోసం పోరాటం చేస్తున్నది. యూనివర్సిటీలను పటిష్టం చేసి, వాటి స్వంతంత్ర ప్రతిపత్తిని పూర్తిగా గౌరవించాలి.

సోషల్మీడియా మెడపై ఈ ప్రభుత్వం కత్తి పెట్టిందని అనుకోవచ్చా? ఇద్దరిని అరెస్టు చేశారు.. ఇది హక్కుల ఉల్లంఘన కిందకు రాదా?

ప్రశ్నించినంత మాత్రాన ఇట్లాంటి అరెస్టులు తగదు. మా దృష్టికి వచ్చిన అరెస్టుల విషయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. అయితే, సోషల్మీడియా కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఎందుకు ప్రచారం చేస్తున్నారని ప్రభుత్వం అడగొచ్చు. ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి. గతంలో ఎలక్ట్రిసిటీ బోర్డు సీఎండీ ప్రభాకర్రావు మీద కూడా ఎన్నో ఆరోపణలు గుప్పించారు. తనకు ఉన్నదే అర ఎకరం. 30 ఎకరాలు ఉన్నాయని అన్నారు. విద్యుత్తు ఉద్యోగులు అందులో పనిచేస్తున్నారని అన్నారు. అవన్నీ అబద్ధాలే. ఎవరిమీదనైనా విషప్రచారం చేస్తున్నారంటే సోషల్ మీడియా విశ్వసనీయత తగ్గిపోతుంది. అయితే, వాస్తవాలు చెప్తునప్పుడు ప్రభుత్వం నిర్బంధించే పరిస్థితులు వస్తే పౌర హక్కుల సంఘం బాధ్యుడిగా ప్రభుత్వంతో మాట్లాడతం, ఉద్యమాలు కూడా చేపడతాం.

పార్టీ ఫిరాయింపుల అంశం హైకోర్టు నుంచి సుప్రీంకోర్టుకు సైతం వెళ్లనున్నది. ఫిరాయింపులపై మీ అభిప్రాయం?

ఒక పార్టీ నుంచి గెలిచిన వారు ఆ పార్టీ భావజాలానికి కట్టుబడి ఉంటూ ప్రజలను కాపాడుకోవాల్సి ఉంటుంది. ఒక పార్టీ గుర్తుపై గెలిచి.. మరో పార్టీలోకి వెళ్తానంటే అందులో స్వప్రయోజనం తప్ప.. ప్రజల ప్రయోజనం ఉండదు. ప్రతిపక్షంలో ఉన్నవారు పార్టీ మారాల్సి వస్తే.. తక్షణం తన ప్రజలకు క్షమాపణ చెప్పి, తాను ఎందుకు పార్టీ మారాల్సి వస్తున్నదో వివరించాలి. గెలిచిన గుర్తుపై రాజీనామా చేసి, తాను మారాలనుకుంటున్న పార్టీ గుర్తుపై పోటీ చేయాలి. అప్పుడు ప్రజలకు అతనిపై నమ్మకం ఉంటే గెలిపిస్తారు. లేకుంటే ఓడగొడతారు. పార్టీ ఫిరాయింపులు అనేది ప్రజాస్వామ్యానికి మంచిది కాదు. ఎవరైనా ఒక పార్టీ గుర్తుపై గెలిచి.. మరో పార్టీకి వెళ్లాలనుకుంటే కచ్చితంగా రాజీనామా చేసే వెళ్లేలా పార్లమెంట్లో ఉన్న చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి. అన్ని రాజకీయ పార్టీలు పాటించాలి.

హైదరాబాద్ తెలంగాణభవన్లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి వీ శ్రీనివాస్గౌడ్, చిత్రంలో కిశోర్గౌడ్, ఉపేంద్ర, శుభప్రద్పటేల్ తదితరులు

బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాలి

- కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
- మాజీ మంత్రి వీ శ్రీనివాస్గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి బీసీ డిక్లరేషన్లో ఇచ్చిన హామీ మేరకు వెనుకబడినవర్గాలకు 42% రిజర్వేషన్లు అమలు చేయాలని మాజీ మంత్రి వీ శ్రీనివాస్గౌడ్ డిమాండ్ చేశారు. నిర్ణీత గడువులోగా కులగణన ప్రక్రియను పూర్తిచేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని కోరారు. సోమవారం ఆయన హైదరాబాద్లోని తెలంగాణభవన్లో మీడియాతో మాట్లాడుతూ.. జంతువులు, పక్షుల గణనకు సర్వేలు చేసే ప్రభుత్వాలు బీసీ కులగణన చేపట్టకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. వెనుకబడిన వారి వివరాలు తేలితే తిరుగుబాటు వస్తుందనే భయంతోనే మిన్నకుండిపోయాయని ఆక్షేపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అన్ని రాష్ట్రాల్లో కులగణన చేపట్టాలని, మండల్ కమిషన్ సిఫార్సులను అమలుచేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన బాధ్యతలను బీసీ సంక్షేమ శాఖకు కాకుండా టౌన్ప్లానింగ్ విభాగానికి ఎందుకు అప్పగించిందని ప్రశ్నించారు. సమావేశంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు కిశోర్గౌడ్, ఉపేంద్ర, శుభప్రద్పటేల్, గొర్రెలు, మేకల సహకార సంఘం మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజుయాదవ్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యాదయ్య పాల్గొన్నారు.

6 నుంచి కుల జనగణన

- నేడు కలెక్టర్లతో సమావేశం
- సామాజికవేత్తలతో భట్టి

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వచ్చే నెల 6 నుంచి కులగణన చేపట్టనున్నట్టు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క తెలిపారు. సోమవారం ఆయన సచివాలయంలో సామాజికవేత్తలు, మేధావులతో సమావేశమై కులగణనలో చేయాల్సిన మార్పులు, చేర్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. కులగణనకు సంబంధించి దిశానిర్దేశం చేయడానికి కలెక్టర్లతో మంగళవారం కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 300 మంది సామాజికవేత్తలు, మేధావులు, అభ్యుదయవాదులతో సమావేశం నిర్వహించి అభిప్రాయాలు, సందేశాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. వీరితోపాటు కులసంఘాలు, యువజన సంఘాలను పిలిచి వారి అభిప్రాయాలు తీసుకుంటామని తెలిపారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఇతర భాగస్వాముల అభిప్రాయాలను సేకరిస్తామని వివరించారు. ఇప్పటికే నాలుగు జిల్లాల్లో 56 ఇండ్లను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని కులగణన సర్వే పూర్తి చేసినట్టు తెలిపారు. సమావేశంలో మంత్రి పొన్నం, ఎమ్మెల్సీ కోదండరాం, తదితరులు పాల్గొన్నారు.

కులగణనపై కమిషన్ మౌనం

- రిజర్వేషన్లపైనే బహిరంగ విచారణ..
- కమిషన్ తీరుపై బీసీ సంఘాల అసంతృప్తి
- కమిషన్ జిల్లా పర్యటనలు ప్రారంభం
- 54 ప్రశ్నలతో కులగణనకు ప్రశ్నావళి?
- 6 నుంచి ప్లానింగ్ విభాగం ద్వారా సర్వే ప్రారంభించేందుకు సన్నాహాలు

ఆదిలాబాద్లో బహిరంగ విచారణకు హాజరైన బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులు

సర్వే తర్వాత బీసీ రిజర్వేషన్లపై స్పష్టత

ఆదిలాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న అన్ని కులాల సామాజిక, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ సర్వే తర్వాత బీసీ రిజర్వేషన్ల విషయంలో స్పష్టత వస్తుందని బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ తెలిపారు. సోమవారం ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో బీసీలకు స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన రిజర్వేషన్లు దామాషాను ఖరారు చేసే అంశంపై బహిరంగ విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90 వేల మంది ఎమ్యునరేటర్లు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లాల వారీగా వచ్చే నెల 13 వరకు బీసీ కమిషన్ బహిరంగ విచారణ చేపట్టి అందరి అభిప్రాయాలు సేకరిస్తుందని తెలిపారు. డిసెంబర్ 9 నాటికి ప్రభుత్వానికి సమాచారం అందిస్తామన్నారు. రాష్ట్రం లో పంచాయతీ పాలక వర్గాలు లేకపోవడంతో కేంద్ర నిధులు రావడం లేదని, ఫలితంగా అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని చెప్పారు.

హైదరాబాద్, అక్టోబర్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కులాలవారీగా ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని, అదేవిధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను స్థిరీకరించాలని నిర్దేశిస్తూ ప్రభుత్వం రాష్ట్ర బీసీ కమిషన్కు మార్గదర్శకాలు జారీ చేసింది. అయితే ప్రస్తుతం బీసీ కమిషన్ కేవలం రిజర్వేషన్ల స్థిరీకరణ అంశంపై మాత్రమే అభిప్రాయాలు సేకరిస్తున్నదంటూ కుల సంఘాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. సమగ్ర కులగణనతోపాటు ఆయా వర్గాల అభిప్రాయాలను సేకరించాలని రాష్ట్ర బీసీ కమిషన్కు సూచిస్తూ గత మార్చిలో ప్రభుత్వం జీవో-26ను విడుదల చేసింది. ఆ తరువాత అందుకు అనుగుణంగా టర్మ్స్ ఆఫ్ రెఫరెన్స్ను జారీ చేస్తూ ఈ నెల 10న జీవో-46ను సైతం జారీ చేసింది. సుప్రీంకోర్టు నిర్దేశించిన ట్రిపుల్టెస్ట్ నిబంధనల మేరకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ బాధ్యతను సైతం రాష్ట్ర బీసీ కమిషన్కే అప్పగిస్తూ, అదే డెడికేటెడ్ కమిషన్గా వ్యవహరిస్తుందని పేర్కొంటూ జీవో- 47ను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ఆయా అంశాలపై కులసంఘాలు, మేధావులు, వ్యక్తుల అభిప్రాయ సేకరణకు ఉమ్మడి పది జిల్లాలవారీగా పర్యటించి బహిరంగ విచారణ చేపట్టాలని బీసీ కమిషన్ ఇప్పటికే నిర్ణయించింది. అందులో భాగంగా సోమవారం ఆదిలాబాద్ జడ్పీ సమావేశ మందిరంలో బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో విచారణ కొనసాగింది. కులగణన అంశాన్ని ప్రణాళికా విభాగం చూస్తున్నదని చెప్తూ.. బీసీ కమిషన్ రిజర్వేషన్ల స్థిరీకరణ అంశంపై మాత్రమే విచారణ కొనసాగించిందని బీసీ కులసంఘాలు అసహనం వ్యక్తం చేస్తున్నాయి. త్వరలో చేపట్టబోయే కులగణన, అందులో పొందుపరచాల్సిన అంశాలపై, అందరి అభిప్రాయాలు, బీసీ కమిషన్ స్వీకరిస్తుందని భావించామని, కానీ నిరాశే మిగిలిందని చెప్తున్నారు. ప్లానింగ్ విభాగం సర్వే నిర్వహిస్తున్నదని, ఆ తరువాతనే రిజర్వేషన్ల విషయంలో స్పష్టత వస్తుందని కమిషన్ చెప్పడంపై కూడా బీసీ కులసంఘాలు మండిపడుతున్నాయి. సర్వేను ఒక విభాగం, రిజర్వేషన్ల స్థిరీకరణను బీసీ కమిషన్ చేపట్టడం ఏమిటని? ప్రశ్నిస్తున్నాయి.

6 నుంచి సర్వే ప్రక్రియ.. 54 ప్రశ్నలు

రాష్ట్రవ్యాప్తంగా చేపట్టనున్న ఇంటింటి సమగ్ర సర్వేకు సంబంధించిన ప్రక్రియను నవంబర్ 6 నుంచి ప్రారంభించేందుకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న ప్రణాళికా విభాగం సన్నాహాలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇప్పటికే కులగణనకు సంబంధించిన ఫార్మాట్ను కూడా సిద్ధం చేసినట్టు సమాచారం. కుటుంబసభ్యులందరి వ్యక్తిగత వివరాలు, చదువు, వృత్తి, ఆస్థులు, రిజర్వేషన్లతో పొందిన ప్రయోజనాలు వంటి వివరాల నమోదుతోపాటు ఆధార్ నంబర్లను సేకరించాలని నిర్ణయించారు. మొత్తంగా ఏడు పేజీలతో దాదాపు 54 ప్రశ్నలతో ప్రశ్నావళిని రూపొందించినట్టు తెలుస్తున్నది. ప్రతి ప్రశ్నకు అనుబంధంగా మరికొన్ని ప్రశ్నలను పొందుపరిచినట్టు సమాచారం. వ్యక్తిగత వివరాలే కాకుండా ఆస్థులు, రిజర్వేషన్లతో పొందిన ప్రయోజనాలు వంటి ఇతర వివరాలను కూడా సేకరించే విధంగా ఫార్మాట్ను సిద్ధం చేశారు.

రంగారెడ్డి కలెక్టర్గా నారాయణరెడ్డి

మొదటిపేజీ తరువాయి...

కలెక్టర్గా పంపగా, ఇప్పుడు స్టేట్ ఫ్లాగ్ షిప్ ప్రాజెక్ట్స్ కమిషనర్గా నియమించారు. హన్మంతరావును ఫిబ్రవరి 5న ఐఅండ్పీఆర్ కమిషనర్గా నియమించి, ఇప్పుడు యాదాద్రి భువనగిరి కలెక్టర్గా బదిలీ చేశారు. నారాయణరెడ్డికి గత 11 నెలల్లో మూడోసారి బదిలీ జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడేనాటికి ఆయన నిజామాబాద్ కలెక్టర్గా ఉండగా, జనవరి 31న వికారాబాద్ కలెక్టర్గా, జూన్ 15న నల్లగొండ కలెక్టర్గా బదిలీ చేశారు. ఇప్పుడు రంగారెడ్డి జిల్లా బాధ్యతలు అప్పగించారు. ఆయన బదిలీపై అధికార వర్గాల్లో భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. సీఎం బంధువు కావడం వల్లే కేవలం 11 నెలల్లో నాలుగు జిల్లాలకు కలెక్టర్గా పని చేసే అవకాశం దక్కిందని అంటున్నారు. సాధారణంగా కలెక్టర్లకు రెండుమూడు జిల్లాల్లో మించి పనిచేసే అవకాశం రాదని అంటున్నారు. టీజీఐఐసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్గా ఉన్న నిఖిల్ చక్రవర్తికి కమర్షియల్ ట్యాక్స్ అదనపు కమిషనర్గా, హాకా ఎండీ కే చంద్రశేఖర్రెడ్డికి డెయిరీ డెవలప్మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ ఎండీగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనిబాలదేవికి అదనంగా స్పోర్ట్స్ డైరెక్టర్ బాధ్యతలు అప్పగించారు. వేర్ హౌసింగ్ కార్పొరేషన్కు ఎఫ్ఏసీ ఎండీగా ఉన్న కొర్ర లక్ష్మికి పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు.

73 మంది ఆర్డీవోల బదిలీ

రాష్ట్రవ్యాప్తంగా 73 మంది స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో 70 మందికి పోస్టింగ్లు ఇవ్వగా, మరో ముగ్గురు డిప్యూటీ కలెక్టర్లను వెయిటింగ్లో ఉంచారు.

ఐఏఎస్ పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
నారాయణరెడ్డి	నల్లగొండ కలెక్టర్	రంగారెడ్డి కలెక్టర్
ఇల త్రిపాఠి	టూరిజం డైరెక్